క్లుప్తంగా

రైల్వే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



సామర్లకోట రైల్వే ప్లాట్‌ఫాంను శుభ్రం చేస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: స్వచ్ఛతా హి సేవ వారోత్సవాలల్లో భాగంగా శుక్రవారం రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ పక్వాడా నిర్వహించారు. ప్లాట్‌ఫారాలపై రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. స్వచ్ఛతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులను నిషేధించామని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కిశోర్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఇంజినీరు (సిగ్నల్) జోగారావు, స్టేషన్ సూపరింటెండెంట్ అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశం

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. ఈ సమావేశాలనికి గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అనంతరం అత్యవసర సమావేశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్న విషయం తెలిసిందే. పట్టణ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనుల నిర్వహణకు కౌన్సిల్ ఆమోదం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు హాజరు కావాలన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

పిఠాపురం: మండలంలోని కోలంకలో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ శుక్రవారం తెలిపారు. అరెస్టు చేసిన వారి నుంచి రూ.6500 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన యువకుడు

పెద్దాపురం: స్థానిక సామర్లకోట రోడ్డులోని చర్చి సెంటర్ వద్ద శుక్రవారం సాయంత్రం ప్రొక్లెయిన్ ఢీ కొని ముగ్గురు యువకులు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం పెద్దాపురం నుంచి సామర్లకోట వైపు బైక్‌పై వెళ్లుతున్న ముగ్గురు యువకులను రోడ్డు దాడుతున్న ప్రొక్లెయిన్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్‌కుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇరువురు యువకులకు స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు ఆ యువకులను కాకినాడ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పెద్దాపురం పోలీసులను వివరణ కోరగా ఆసుపత్రి నుంచి సమాచారం రావాల్సి ఉందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ప్రజలు స్నేహభావంతో మెలగాలి

- పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

కిర్లంపూడి: ప్రజలు రాగద్వేషాలకు పోకుండా ఒకరికొకరు స్నేహభావంతో మెలగాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సూచించారు. మండలంలోని రాజుపాలెంలో శుక్రవారం రాత్రి ఎస్సై పి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వారధి కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శాంతిభద్రతలు, చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లతాకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో వచ్చే చిన్నచిన్న తగాదాలకు ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకోవడం సరికాదన్నారు. తద్వారా ఏళ్ల తరబడి పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగడం వల్ల ఆర్థికంగా నష్టపోతారన్నారు. గ్రామ పెద్దల సమక్షంలోనే సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గణేశుల లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

తలుపు తట్టి.. నాడి పట్టి..

- విస్తృతంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటి బాట పట్టిన వైద్యాధికారులు, సిబ్బంది
- నేటి నుంచి శిబిరాలు, పరీక్షలు ప్రారంభం



పెద్దాపురం అర్బన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కాండ్రకోటలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దాపురం: తాతా.. రోజూ షుగర్ మాత్రలు వేసుకుంటున్నావా..? అవ్వా ఆరోగ్యం ఎలా ఉంది...? పెద్దాయనా బీపీ కంట్రోల్‌లోనే ఉంటోందా..? ఉప్పు, కారాలు తగ్గించి ఆహారం తీసుకుంటున్నావా? ఇటువంటి కుశల ప్రశ్నలతో వైద్యాధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టనున్నారు. అందులో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఇంటి బాట పట్టారు.

గ్రామాల్లో సర్వే ఇలా.....:

ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఈ నెల 16 నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్యలకు సంబంధించి 7 రకాల పరీక్షలను అక్కడికక్కడే నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని నిర్ధారిస్తున్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ రక్తపోటు, మధుమేహం పరీక్షలు చేయడంతో పాటు పదేళ్లు దాటిన వారందరికీ హెమోగ్లోబిన్ పరీక్షలు, రెండు వారాలకు మించి దగ్గుతో బాధపడుతున్న వారికి డెంగీ, మలేరియా, పూర్తి యూరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఒక్కరికీ జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నిర్వహించే మెరుగైన వైద్యం కోసం టోకెన్లు జారీ చేస్తున్నారు.

నియోజకవర్గంలో శిబిరాల వివరాలు

మండలం	గ్రామాలు	సచివాలయాలు	శిబిరాలు
పెద్దాపురం	23	22	22
సామర్లకోట	18	23	23
పెద్దాపురం అర్బన్ వార్డులు	29	14	14
సామర్లకోట అర్బన్ వార్డులు	30	15	15
మొత్తం	100	74	74

నేటి నుంచి జగనన్న సురక్ష శిబిరాలు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ జె రామారావు తెలిపారు. గణపతినగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభిస్తారని తెలిపారు. ఒకటి నుంచి 9 వార్డులకు చెందిన ప్రజలతో పాటు 22, 23, 26, 29, 30, 31 వార్డులకు చెందిన ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఆయా వార్డుల్లో వైద్యం కోసం పేర్లు నమోదు చేయించుకున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



గ్రామాల్లో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 162 రకాల మందులు, 18 శస్త్రచికిత్సలు చేస్తారు. ఆరోగ్య శిబిరాల్లో స్థానిక పీహెచ్‌సీలోని ఇద్దరు వైద్యులు, ఫ్యామిలీ డాక్టర్, స్పెషలిస్ట్ డాక్టర్లతో పాటు ఇతర సిబ్బంది హాజరవుతారు. శిబిరాల్లో నయంకాని, పెద్ద చికిత్సలు అవసరమైతే ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. – గవరసాని సూరిబాబు, జెడ్పీటీసీ, పెద్దాపురం

అనారోగ్య రహిత గ్రామాలే లక్ష్యం



అనారోగ్య రహిత గ్రామాలే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఎంతోగానో సత్ఫలితాలను అందిస్తుంది. దీర్ఘకాల ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకు కార్పొరేట్ వైద్యాన్ని గ్రామాల్లోకి తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. – ఎస్.సుదీప్తి, ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి, పెద్దాపురం

ఏర్పాట్లు పూర్తి చేశాం



శనివారం నిర్వహించనున్న ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లను పూర్తి చేశాం. మండలంలోని 23 గ్రామ సచివాలయాలకు 22 ఆరోగ్య శిబిరాల ఏర్పాట్లను పూర్తిచేశాం. రోగులకు నిర్వహించే వైద్య పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలల వద్ద శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శిబిరాల వద్ద తగిన ఏర్పాట్లు చేశాం. – బత్తిన అశోక్‌కుమార్, ఎంపీడీఓ, పెద్దాపురం మండలం

పాదగయ క్షేత్రంలో సౌందర్య లహరి పారాయణ



పాదగయ క్షేత్రంలో సౌందర్య లహరి పారాయణ చేస్తున్న భక్తులు

పిఠాపురం: పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం పిఠాపురం పాదగయ క్షేత్రంలోని పురుహూతికా అమ్మవారి సన్నిధిలో సామూహిక సౌందర్య లహరి పారాయణ చేశారు. పిఠాపురానికి చెందిన బాదం సీతారత్నం, బాదం శిరీషల ఆధ్వర్యంలో సుమారు 50 మంది మహిళలు పారాయణ నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈఓ వడ్డి శ్రీనివాసరావు సౌందర్య లహరి పుస్తకాలను ఆవిష్కరించారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి ఆలయ అర్చకులు వీరబాబు దత్తులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, అర్చనలు, సామూహిక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



కార్మికురాలిని పరీక్షిస్తున్న వైద్యాధికారులు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ శిబిరాన్ని ప్రారంభించగా, డాక్టర్ మహోన్నత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్రరావు, పితాని కృష్ణ, యార్లగడ్డ జగదీష్, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వీరుల త్యాగాలు ఆదర్శం కావాలి



దేశ నారీమణుల వేషధారణతో విద్యార్థులు

సామర్లకోట: దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వీరుల త్యాగ నిరతిని నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హౌస్కూల్‌లో శుక్రవారం 'మేరీ మిట్టీ–మేరా దేశ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాత భేరి నిర్వహించి వివిధ జాతీయ నాయకుల చిత్ర పటాలను, నాయకుల వేషధారణలో కలశంతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, జి.గోవిందు, కె.అరుణ, కేవీవీ సత్యనారాయణ, ఏఎల్‌వీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

శోకసంద్రంగా మారిన వాకతిప్ప

- మృతులకు అంత్యక్రియలు
- పాఠశాలకు శెలవు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్పలో గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన చేతిపువ్వు సూర్య చక్రశ్రావణి, మామిడి చిన్నయదొరల మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం గ్రామానికి తీసుకువచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రావణి స్థానికంగా ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమె మృతికి ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలకు సెలవు ప్రకటించారు. తోటి విద్యార్థులు శ్రావణి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై సమీక్ష

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలుపై రహస్య డెకాయ్ ఆపరేషన్లను మరింత విస్తృతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఈ చట్టం అమలు పర్యవేక్షణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ కొత్తగా ఏర్పాటైన 4 అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లకు, చిరునామా, పరికరాలు, సిబ్బంది మార్పులు కొరకు దరఖాస్తులు చేస్తున్న 6 సెంటర్లకు కమిటీ అనుమతులు జారీ చేసింది. కమిటీ సభ్యులు 4వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, అడిషనల్ ఎస్పీ పి శ్రీనివాస్, డీఎంఅండ్‌హెచ్‌వో జె.నరసింహ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్.లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన జీజీహెచ్ సూపరింటెండెంట్

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. జీజీహెచ్ ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆమెకు సూచించారు.

క్రీడా పరికరాల కిట్ల పరిశీలన

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర గవర్నమెంట్‌కు సంబంధించిన నమూనా కిట్లను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ హెడ్‌క్వార్టర్‌లో ఈ టోర్నీ కిట్ల పంపిణీకి సంబంధించి సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో సచివాలయ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పంపిణీ చేసే కిట్లు, నియోజకవర్గ స్థాయి నుంచి, జిల్లా స్థాయి వరకు పంపిణీ చేసే కిట్లను జిల్లా కేంద్రాలకు పంపినట్లు కలెక్టర్ వివరించారు.

వ్యాన్ దగ్ధం

కాకినాడ క్రైం: కాకినాడ ప్రభుత్వాస్పత్రి బస్టాండ్ ఆవరణలో వార్త పత్రికలు బట్వాడా చేసే ఒక వ్యాన్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతి అయ్యింది. సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరానికి చెందిన కె.రామకృష్ణకు మారుతీ ఎకో వ్యాన్ ఉంది. ఈ వాహనంపై వార్తాపత్రికలు వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం రాజానగరం నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వెళ్లిన రామకృష్ణ తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రానికి వెళ్లేందుకు కాకినాడ మీదుగా పయనమయ్యారు. వ్యాన్ జీజీహెచ్ బస్టాండ్ వద్దకు వచ్చే సరికి షార్ట్‌సర్క్యూట్‌తో మంటల్లో చిక్కుకుంది. యజమాని రామకృష్ణతో సహా సహాయకుడు వాహనాన్ని అక్కడే వదిలేసి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. స్థానికులు సాలిపేట అగ్ని మాపకశాఖకు సమాచారం ఇవ్వగా, సాలిపేట అగ్నిమాపక బృందం అక్కడకు చేరుకుని ఫైర్‌మెన్ రాంబాబు ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు. రూ.2 లక్షల ఆస్తినష్టం జరగ్గా, రూ.2.5 లక్షల ఆస్తిని సంరక్షించినట్టు ఏడీఎఫ్‌వో తెలిపారు.

దేశానికి రైతే వెన్నెముక

- బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపు



బలరాముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నారాయణమూర్తి తదితరులు

పెద్దాపురం: దేశానికి రైతే వెన్నెముక అని, రైతు లేనిదే అభివృద్ధి సాధ్యపడదని భారతీయ కిసాన్ సంఘ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు గోపు నారామణమూర్తి అన్నారు. బలరాముని జయంతి పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మండలంలోని తిరుపతి గ్రామంలో నిర్వహించిన జయంత్యుత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో వారు మాట్లాడుతూ బలరాముడు, నాగలి, గోపూజ విశిష్టత గురించి వివరించారు. అనంతరం కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుంచే నాగేశ్వరరావు, దొడ్డ అప్పారావు, యడవల్లి కొండలరావు, తమ్మనబోయిన నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో న్యాయమూర్తి పూజలు



మరిడమ్మ ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందిస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ ఆలయంలో శుక్రవారం ఏడో అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి ప్రత్యేక పూజలు చేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి అనిత స్థానంలో పూర్తి స్థాయి జిల్లా జడ్జిగా చంద్రమౌళీశ్వరి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించగా ఆమెకు వేద పండితులు మంత్రాల మధ్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు.

భూముల రీ సర్వేపై సమీక్ష

జగ్గంపేట: జగనన్న శాశ్వత భూహక్కు– భూ రక్ష పథకంలో చేస్తున్న భూముల రీ సర్వే పారదర్శకంగా చేయాలని వీఆర్‌ఓలు, సర్వేయర్లకు పెద్దాపురం ఆర్డీఓ కె.సీతారామరావు సూచించారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం భూముల రీ సర్వేపై వీఆర్‌ఓలు, సర్వేయర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేపై రైతులకు ముందుగా నోటీసులు ఇవ్వాలన్నారు. రైతుల సమక్షంలోనే వారి భూములకు కొలతలు వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



జగ్గంపేటలో భూముల రీసర్వేపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

అమెరికా నుంచి రమణక్కపేటకు...

- సెక్యూరిటీ గార్డు కూతురు ప్రభుత్వ ప్రతినిధిగా అమెరికా పర్యటన
- యూఎన్ఓ, వరల్డ్ బ్యాంకుల్లో ప్రసంగం
- అమెరికా అధ్యక్ష భవనం సందర్శన
- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు



అమెరికా వెళ్లి వచ్చిన తమ కుమార్తె జ్యోత్స్నను ముద్దాడుతున్న తల్లిదండ్రులు



అమెరికా నుంచి తెచ్చిన హ్యాండ్ బ్యాగ్ తల్లికి ఇచ్చి ఆనందం పంచుకుంటున్న జ్యోత్స్న

పిఠాపురం: అమెరికాలోనిని పలు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్న కొత్తపల్లి మండలం రమణక్కపేటకు చెందిన ఒక సామాన్య సెక్యూరిటీ గార్డు కూతురు జ్యోత్స్న శుక్రవారం తన స్వగ్రామం రమణక్కపేట చేరుకుంది. ఐక్యరాజ్య సమితికి రాష్ట్ర ప్రతినిధురాలుగా ప్రభుత్వ పాఠశాల నుంచి విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థి జ్యోత్స్న ఎంపికై ంది. ఈమె యూఎన్ఓ, వరల్డ్ బ్యాంకుల్లో ప్రసంగించింది. అమెరికా అధ్యక్ష భవనం సందర్శించి అమెరికా పర్యటన విజయవంతంగా పూర్తి చేసుకుని ఇంటికి చేరుకోవడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కూతురు విజయాన్ని చూసి తల్లిదండ్రులు సింహాచలం, శాంతి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరింత బాగా చదివి నా ఆశ నేరవేరుస్తుందని ఆశిస్తున్నాని ఆమె తండ్రి సింహాచలం ఆనందం వ్యక్తం చేశారు. పేదలు పెద్ద చదువులు చదవాలన్నదే తన ధ్యేయమని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో చేసిన మార్పులే తన విజయానికి కారణమని విద్యార్థిని జ్యోత్స్న సంతోషం వ్యక్తం చేసింది. పక్క ఊరు వెళ్లాలంటేనే ఇబ్బంది పడే నిరుపేద కుటుంబం నుంచి తనను అమెరికాకు పంపిన ఘనత సీఎం వైఎస్ జగన్ మావయ్యకే దక్కుతుందని ఆమె తెలిపింది. సీఎం వైఎస్ జగన్ అందించిన ప్రోత్సాహంతో మరిన్ని విజయాలు సాధించడానికి కృషి చేస్తానని చెప్పింది.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి



పిఠాపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పిఠాపురం: విద్యార్థులు దేశ భక్తిని పెంపొందించుకోవాలని డీవైఈఓ సుభద్ర సూచించారు. పిఠాపురం ఆర్ఆర్‌బీ హెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు తెలుసుకోవాలన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాలని సూచించారు. అనంతర విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పట్టణంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం.విజయరామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మూలపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ మౌనిక

మూలపేటలో 'నా భూమి– నా దేశం'

కొత్తపల్లి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలు మరువలేమని మూలపేట సర్పంచ్ కంబాల మౌనిక అన్నారు. మండలంలోని మూలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం నాభూమి నాదేశం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యవర్గ సభ్యుడు సిద్ది సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోటలో కట్టమూరు రొడ్డులో ఏర్పాటు చేసిన 16 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహం వద్ద శుక్రవారం భారీ అన్న సంతర్పణ జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ దీనిని ప్రారంభించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, గంటా రామస్వామి, నాగబోయిన రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: స్థానిక పవన్‌కుమార్ గ్యాస్ ఏజెన్సీ సమీపంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వాహకులు శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దొరబాబు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు రెడ్డి లోవకుమారి, పాగా సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న దొరబాబు

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని స్థానిక గాదులదొడ్డిలో గణపతి మందిరం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో పెళ్లి విందును తలపించేలా అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.